# వ్యాస కౌముది



## మనభారతం

డా.వల్లూరుపల్లి శివాజీరావు

83

***నా మాట:*** *ప్రపంచ పాఠకులను విశేషంగా ఆకర్షించి, ఆకట్టుకుని, వారిచేత ఆదరించబడుచున్న, అసమాన తెలుగు మాస పత్రిక* ***'కౌముది'*** *లో ప్రచురితమైన నా* ***'మనభారతం'*** *వ్యాస సంపుటి జనవరి 2010 నుండి డిసెంబర్ 2015 వరకు నిరాటంకంగా 72 నెలలు ప్రచురితమయింది. కొంతకాలం విరామం తరువాత ఆగస్టు 2018 నుండి 10 సంచికలలో* ***"చేజారిన భారతదేశ రత్నరాజములు"*** *గురించి విపులంగా తెలియజేయటం జరిగింది. ఈ వ్యాసాలలో ఆంధ్రప్రదేశ్ లోని కొల్లూరు-పరిటాల వజ్ర గనులనుంచి వెలికి తీయబడిన వజ్రాలలో పశ్చిమ దేశాలకు తరలించబడిన కొన్ని అత్యద్భుత వజ్ర రాజముల గురించి విపులంగా తెలుసుకొనటం జరిగింది.*

*ప్రస్తుత సంచిక నుంచి కొన్ని నెలల పాటు శాలివాహనులు, వారి సామ్రాజ్యం, రాజులు, ఇతర సంబంధిత విషయాల గురించి నా పరిశోధనల ఆధారంగా విపులంగా చర్చింటం జరుగుతుంది. ఈ వ్యాసాలను మీరు చదివి ఆనందిస్తారని భావి స్తున్నాను.*

# శాతవాహనులు



సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014లో విభజించబడిన తరువాత నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 'అమరావతి' పట్టణం రాజధానిగా ఏర్పడింది. అప్పటినుంచి ఈ పట్టణాన్ని 2,000 సంవత్సరాల క్రితం రాజధానిగా చేసుకుని పరిపాలన సాగించిన "శాతవాహనుల" గురించి తెలుసుకోవాలనే ఉత్సుకత తెలుగు ప్రజలలో కలిగింది.

క్రీ.పూ. 230 నుంచి సుమారు 450 ఏళ్ల పాటు దక్షిణ, మధ్య భారతావనితోపాటు కొంతమేర పశ్చిమ ప్రాంతాలను కూడా శాతవాహనులు (ఆంధ్రులు) పరిపాలించారు. ఈ శాలివాహనుల రాజ వంశంలో 30 మంది రాజులు, మహారాజులు ఉన్నారు.

ఈ వ్యాసాలద్వారా శాతవాహనుల మూలాలు, శాతవాహన రాజులు, వారు సాధించిన విజయాలు, శాలి వాహన శకం ప్రారంభం, మత, ఆధ్యాత్మిక, సాంస్కృత, తదితర రంగాలలో వీరి సాధించిన విషయాలగురించి తెలుసుకుందాం.

**శాతవాహనుల మూలాలు**

శాతవాహనుల గురించి, వారు రాజులుగా ఉన్నప్పటి బిరుదు 'శాతకర్ణి' (Sātakarni) గురించి వివిధ మూలాలు ప్రచారంలో ఉన్నాయి. లిపి ఆధారిత గ్రంధాలు, పురాణ గ్రంధాలు శాతవాహనులను ఆంధ్రులు, ఆంధ్ర జాతీ యులు, ఆంధ్ర భృత్యులు వర్ణించాయి.

విష్ణు సహస్రనామ స్తోత్రంలో 825 వ నామం 'చాణూరాంధ్ర నిషూదనః' (చాణూరుడను మల్లయోధుడిని వధించినవాడు) గా ఉంది. **దీనిని బట్టి కంసుని వధించేముందు శ్రీకృష్ణుడు మల్లయుద్ధంలో చాణూరుడు అనే ఆంధ్రుడిని వధించినట్లు తేట తెల్లమవుతుంది. దీనిని బట్టి భారతకాలం నాటికే ఆంధ్ర జాతి ఉనికి ఉన్నట్లు ధృవబడింది. కొన్ని గ్రంధాలలో వీరిని శాలివాహనులు, శాతకర్ణులు గా గుర్తించబడ్డారు. వీరి మీద ద్రావిడుల ప్రభావంతో పాటు, ఉత్తర భారతీయుల ప్రభావం కూడా ఉండియుండవచ్చు.**

'ఆంధ్ర' అనే పదం గిరిజన (tribal), ప్రాదేశిక (territorial) పదాలకు సంబదితమైంది. 'ఐతరేయ బ్రాహ్మణ' (Aitareya Brāhmana) గ్రంథంలో ఆంధ్రులు గోదావరి-కృష్ణ నదుల మధ్య ఉన్న ప్రదేశంలో నివసిస్తున్న వారని వ్రాయబడింది.

మహర్షి 'మహీదాస ఐతరేయ' (Mahīdāsa Aitareya) రచించిన 'ఐతరేయ బ్రాహ్మణ' గ్రంధం ఆంధ్రులు బ్రహ్మర్షి విశ్వామిత్ర చేత శపించబడిన ఆయన 50 మంది పుత్రుల వారసులని పేర్కొన్నది. ఈవారసులు కాల క్రమేణా 'ఆంధ్ర', 'ముతిబ' (Mutiba), 'పులింద' (Pulinda), 'శబర' (Shabara), 'దాస్య' (Dāsya) తెగలకు సంబం ధించిన వారిగా పరిగణించబడ్డారు.

మహాభారత గ్రంధం ఆంధ్రులు కురు సామ్రాజ్యానికి సామంతులు, పాలెగాళ్ళు (feudatories) గా ఉన్నా రని, మహాభారత యుద్ధం లో కౌరవుల తరపున పాండవులకు వ్యతిరేకంగా యుద్ధం చేసి ప్రాణాలను అర్పించారని పేర్కొంది. తమిళ సాహిత్య గ్రంధం '**సంగం**' (Sangam: క్రీ.పూ. 200-300) లో ఆంధ్రులను 'వడగు' (Vadagu), 'వడకు' (Vadaku), 'వడుగర్' (Vadugar) గా పేర్కొనబడింది. వీరు తమిళులకు ఉత్తరాన ఉన్న భూభాగం లో ఉన్నారు కాబట్టి ఈ పదాలతో సంభోదించారు.

ఉత్తరం నుంచి దక్షిణాభిముఖంగా వెళ్లిన మొదట ఇప్పటి ఆంధ్ర, తెలంగాణ ప్రాతంలో స్థిరపడి, కొంత మంది క్రమేణా దిగువ దక్షిణాపధంకు వెళ్లారు. అంతేగాక ఆంధ్ర పాలకులు భూమి, ద్రవ్యము, ఇతర ప్రోత్సాహ కాలు ఇచ్చి వేదకాలపు భారతీయులను, ముఖ్యంగా బ్రాహ్మణులను ఇక్కడ స్థిరపడేటట్లు చేసారు. తత్ఫలితంగా ఆంధ్ర జాతి, తమకంటూ ఒక భాష, నాగరికత, వేధారిత సంస్కృతి ఏర్పరచుకున్నారు. ఈ ఆంధ్ర జాతి క్రమక్రమంగా ఉత్తర-దక్షిణ మిశ్రమ జాతి గా రూపొందింది. ఈజాతి ప్రజల ప్రధాన భాష **తెలుగు. ఇది సంస్కృతం, ప్రాకృత భాషల మిశ్రమ భాషయే.**

పశ్చిమ-దక్షిణ భారతావని (దక్కన్: Deccan), ఇతర ప్రాంతాలలో బయల్పడిన నాణెముల ద్వారా ఆంధ్రులను **ఆంధ్రభృత్యులు** (Āndhrabhrityās), **శాతవాహనులు**, **శాలివాహనులు**, **శాతకర్ణిలు** గా పరిగణించి నట్లుగా వెల్లడయింది. ఆంధ్రభృత్యులు మొదట **మౌర్య** రాజులకు, ఆ తరువాత **సుంగ** (Sunga) రాజులకు సామం తులు, సేవకులు, సహాయకులు, ఉద్యోగస్తులు, అనుచరులు కాబట్టి వీరు ఆవిధంగా పరిగణించబడవచ్చు.

ప్రాకృత భాషలో శాతవాహన పదం '**సప్తవాహన**' (Saptavahana) పదానికి శబ్దార్ధమే. ఈ ఆంధ్ర రాజులు సూర్యవంశజులు. సూర్య దేవుడు సప్తాశ్వ రధాదుడు (ఆయన రధాన్ని ఏడు అశ్వాలు లాగుతాయి) కాబట్టి వీరిని సప్తవాహనులు (శాతవాహనులు) గా పరిగణించారు. '**సప్త**' సంస్కృత పదమయితే '**శాత**' పదం ప్రాకృత పదం అయిఉండవచ్చు.

అలాగే శాలివాహన పదం శాతవాహన పదం నుంచి ఉత్పన్నమైనదే. ఈ పదానికి మూలం 'గౌతమీపుత్ర శాతకర్ణి' (Gautami Putra Sātakarni). ఈ శాతవాహన రాజు క్రీ.శ. 78 లో ఉజ్జయిని రాజు విక్రమాదిత్య మీద సాధిం చిన విజయం జ్ఞాపకార్థం ఆయన శాలివాహన శకాన్ని ఆ సంవత్సరం లో ప్రారంభించాడు.

ఈ విక్రమాదిత్య రాజు క్రీ.శ. 57 లో '**విక్రమ్ సంవత్**' (Vikram Samvat: విక్రమ సంవత్సరం) శకాన్ని ప్రారంభించాడు. 21 ఏళ్ల తరువాత ఈయనపై సాధించిన విజయం సందర్భంగా గౌతమీపుత్ర శాతకర్ణి తన స్వంత శకాన్ని ఆరంభిచాడు. ఈరోజుకూ తెలుగు ప్రజలు ఈ శాలివాహన శకాన్ని అనుసరిస్తున్నారు.

ముందు తరం శాతవాహన రాజులు ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర భూమిని పరిపాలించారు. ఈ ప్రాంతమే వీరి ముఖ్యభూమి. వీరు బలపడినకొద్దీ తమ ఇప్పటి మహారాష్ట్ర ప్రాంతాన్ని, మధ్యప్రదేశ్ లోని కొంతప్రాంతాన్ని (మాళ్వ: Malwa), ఉత్తర కర్ణాటక, గుజరాత్, ఒడిస్సా (Orissa) లోని కొంత ప్రాంతాలను జయించి, స్వాధీనం చేసుకుని తమ సామ్రాజ్యాన్ని విస్తరించారు. కరీంనగర్ జిల్లాలోని **కోటిలింగాల, కొండాపూర్** లలో బయల్పడిన నాణెముల ద్వారా శాతవాహన రాజు '**శ్రీముఖ**'/'**సీముఖ**' (Srimukha/Simukha) మహారాష్ట్ర ప్రాంతా న్ని జయించాడని ధ్రువపడింది.

ఆంధ్ర రాజుల పాలన క్రీ.పూ. 230 నుంచి సుమారు 450 సంవత్సరాల పాటు సాగింది. భారత దేశ చరిత్రలో ఏ రాజ వంశం ఇంత దీర్ఘ కాల పరిపాలన జరపలేదు. ఉశ్చ స్థితిలో ఉన్నకాలంలో ఆంధ్ర రాజ వంశం భారతభూభాగంలో 65 శాతం పైగా పరిపాలించింది.

ఇంత విశాల భూభాగం, సామంతుల మీద ఆధిపత్యం ఒక్క మౌర్య వంశం, ఆంధ్ర రాజ వంశానికే గాని వేరే ఏ రాజ వంశానికి సాధ్యం కాలేదు. ఈ ఆంధ్ర వంశం క్రీ.పూ. 232 లో జరిగిన మౌర్యులపతనం మొదలు క్రీ.శ. 240 లో గుప్త సామ్రాజ్యం ఎదిగేవరకు ఆంధ్ర రాజులు భారదేశ చరిత్రలో అతిముఖ్యమైన పాత్ర పోషించారు.

రోమన్ చరిత్రకారుడు, నావికాధికారి మరియు సైన్యాధికారి "Pliny the Elder " ((Gaius Plinius Secundus: క్రీ.శ. 23-79) ఆంధ్రులు ఒక శక్తివంతమైన, అసమానమైన జాతి అని ప్రశంసించాడు.

**శాతవాహన సామ్రాజ్య స్థాపన**

క్రీ.పూ. 321 లో స్థాపించబడిన, పాటలీపుత్ర ను రాజధానిగా చేసుకున్న మౌర్య వంశ రాజులకు ప్రాంతీయ పాలకులుగా శాతవాహనులు తమ రాజ జీవితాన్ని ప్రారంభించారు. '**నంద**' (Nanda) వంశ చివరి రాజు '**ధనానంద**' ను ఓడించటానికి అప్పటి శాతవాహన ప్రాంతీయ పాలకుడు (Provincial Governor) చంద్రగుప్త మౌర్య కు లక్ష మంది సైనికులు, 2,000 మంది అశ్వారూధులు, 1,000 గాజారూధులను సరఫరా చేసాడు. ఈ విషయం చంద్రగుప్త మౌర్య సంస్థానంలో గ్రీకు రాయభారిగా ఉన్న '**మెగస్తనీస్**' (Megasthenese: క్రీ.పూ. 350-290) ధృవీకరించాడు.




క్రీ.పూ. 298 లో **చంద్రగుప్తమౌర్య** జైన మతం స్వీకరించి, సింహాసనాన్ని త్యజించి జైన సన్యాసి **భద్ర బాహు** కు శిష్యుడయిన తరువాత, ఆయన పుత్రుడు '**బిందుసార**' (పాలన క్రీ.పూ. 298-272). క్రీ.పూ. 272 లోబిందుసార మరణించిన తరువాత '**అశోక**' (పాలన: క్రీ.పూ. 268-232) తన 98 సోదరులను హతమార్చి268 లో మౌర్య సామ్రాజ్యాన్ని అధిష్టించాడు. బిందుసార, అశోక చక్రవర్తులకు కూడా శాతవాహనులు ప్రాంతీయ పాలకులుగా కొనసాగారు.

36 సంవత్సరాలు చక్రవర్తిగా భారతావనిని పరిపాలించిన సమయంలో అశోకుడు బౌద్ధ మతాన్ని విశ్వవ్యాప్తి చేసి క్రీ.పూ. 232 లో మరణించిన తరువాత ఆయన పుత్రులు, పౌత్రులు అధికార పెనుగులాటలో బలహీనులయ్యారు. తత్ఫలితంగా వారు తమ మౌర్య సామ్రాజ్యం మీద పట్టు కోల్పోయి బలహీనులవటం జరిగింది.

తగిన సమయం కోసం ఎదురుచూస్తున్న మౌర్య రాజ్యానికి సామంత రాజు '**శ్రీముఖ**' (ప్రాకృతం: 'సీముక') మౌర్య సామ్రాజ్యం నుంచి క్రీ.పూ. 230లో స్వాతంత్రం ప్రకటించి '**శాతవాహన**' సామ్రాజ్యాన్ని స్థాపించాడు.

*సశేషం*

**మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com**

COMMENTS